- గ్రీనరీ ప్రాంతాల్లో అక్రమంగా నిర్మించిన పార్కింగ్ షెడ్లు, గదులు, టీ స్టాళ్లు
- మరోవైపు భవన నిర్మాణ సామగ్రి డంప్
- స్వచ్ఛమైన గాలికి దూరమవుతున్న బస్తీవాసులు

గ్రీనరీ

గాయబ్..!

పారిశ్రామిక ప్రాంతాల్లో పచ్చదనం కనుమరుగు


రంగారెడ్డినగర్ ప్రధాన రోడ్డులో ఇటుక, డస్ట్ డంపింగ్

పచ్చదనంతో కళకళలాడాల్సిన పారిశ్రామికవాడల్లో క్రమంగా పచ్చదనం కనుమరుగవుతోంది. గత బీఆర్ఎస్ హయాంలో హరితహారంలో భాగంగా ఐలా అధికారులు వేలాదిగా నాటిన మొక్కలపై పర్యవేక్షణ లేక ప్రస్తుతం వాటి జాడ మచ్చుకైనా కనిపించడం లేదు. దీంతో పారిశ్రామికవాడకు ఆనుకుని ఉన్న బస్తీవాసులు స్వచ్ఛమైన గాలికి దూరమవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్, రంగారెడ్డినగర్, గురుమూర్తినగర్, గిరినగర్, వెంకట్రామిరెడ్డినగర్, సంజయ్‌గాంధీనగర్, నెహ్రూనగర్, పంచశీలకాలనీ, చెన్నారెడ్డినగర్‌ను ఆనుకుని సీఐఈ గాంధీనగర్, ఐడీపీ గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతాలు విస్తరించి ఉన్నాయి. కెమికల్ పరిశ్రమలతో పాటు ఇంజినీరింగ్, ప్యాకింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ పరిశ్రమలతో పాటు ఇతర చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పారు. అయితే ఏ ఒక్క పరిశ్రమ ఎదుట మచ్చుకైనా పచ్చదనం కనిపించదు. ఉన్న గ్రీనరీని సైతం కొందరు పరిశ్రమల యాజమాన్యాలు తొలగించి తమ సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నాయి. పారిశ్రామిక ప్రాంతంలో 25 శాతం గ్రీనరీ ఉండాలనే ప్రభుత్వ నిబంధనలు అధికారుల నిర్లక్ష్యంతో అమలుకు నోచుకోవడం లేదు. -రంగారెడ్డినగర్


చెన్నారెడ్డినగర్‌లో పరిశ్రమ ఎదుట పార్కింగ్ షెడ్డు..

నాటిన మొక్కలు మాయం

సీఐఈ గాంధీనగర్, ఐడీపీ గాంధీనగర్ ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ, ఐలా ఆధ్వర్యంలో గతంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా వేలాది మొక్కలను పారిశ్రామికవాడ రోడ్లకిరువైపులా నాటారు. అయితే పలు పరిశ్రమల యాజమాన్యాలు భవనాల విస్తరణలో భాగంగా చెట్లను తొలగించాయి. మరికొన్ని పరిశ్రమల ఎదుట నాటిన మొక్కలకు నీళ్లు పోయకపోవడంతో ఎండిపోయి ప్రస్తుతం మొక్కలు కానరావడం లేదు. మరోవైపు కొన్నేళ్లుగా పారిశ్రామికవాడ ప్రాంతంలో హరితహారం కార్యక్రమం నిర్వహించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశ్రామిక ప్రాంతంలో గ్రీనరీని పెంచాలని స్థానికులు కోరుతున్నారు.


హరితహారంలో నాటిన మొక్కల ప్రాంతంలో పార్కింగ్ షెడ్డు

పరిశ్రమల ముందే పార్కింగ్ షెడ్లు ..

గాంధీనగర్ సీఐఈ, ఐడీపీ పరిధిలోని పరిశ్రమల ఎదుట ఐలా అధికారులు గ్రీనరీకి కొంత ప్రాంతాన్ని వదిలారు. ఇందులో విధిగా సదరు పరిశ్రమల యాజమాన్యాలు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నిబంధనలు ఉన్నాయి. అయితే ఏ ఒక్క పరిశ్రమ నిబంధనలు పాటించడం లేదు. పరిశ్రమ ఆవరణలోనే వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉండగా కొందరు గ్రీనరీని తొలగించి షెడ్లు, సెక్యూరిటీ, వాచ్‌మెన్‌ల గదులు నిర్మించారు. దీంతో పలు పరిశ్రమల ముందు పచ్చదనం ఆనవాళ్లే కరుమరుగయ్యాయి.

గ్రీనరీ ప్రాంతాల్లో డబ్బాలు, టిఫిన్ సెంటర్లు ..

గాంధీనగర్ పారిశ్రామిక ప్రాంతంలోని వివిధ పరిశ్రమలకు నిత్యం లోడింగ్, అన్‌లోడింగ్ కోసం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. లారీల సిబ్బంది రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. దీంతో ఈ ప్రాంతంలో తినుబండారాలు, టీస్టాళ్లకు గిరాకీ పెరిగింది. ఈ నేపథ్యంలో గ్రీనరీ ప్రాంతంలో టీస్టాళ్లు, టిఫిన్ సెంటర్లు వెలిశాయి. సమీపంలోని పరిశ్రమల యాజమాన్యాలే టీస్టాళ్లు, డబ్బాల నిర్వాహకుల నుంచి నెలవారీ అద్దెలు వసూలు చేస్తున్నారన్నది బహిరంగ రహస్యం. ఐలా అధికారులకు ఈ విషయం తెలిసినా పరిశ్రమల యాజమాన్యాలతో వారికున్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

యథేచ్ఛగా ఇటుక, ఇసుక వ్యాపారం

రంగారెడ్డినగర్ బస్టాప్ సమీపంలోని గాంధీనగర్ పారిశ్రామికవాడ గ్రీనరీ ప్రాంతంలో కొందరు చెట్లను తొలగించి యథేచ్ఛగా ఇటుక, డస్ట్, ఇటుక వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఇదంతా ప్రధాన రహదారిలోనే జరుగుతున్నా గాంధీనగర్ ఐలా అధికారులకు కనిపించకపోవడం గమనార్హం. ఎవరైనా ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా కొందరు ప్రజాప్రతినిధుల అండదండలు ఉండటంతో ఐలా అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.


గాంధీనగర్ విరూపాక్ష కెమికల్స్ పరిశ్రమను ఆనుకుని ఉన్న షెడ్డు

అక్రమ నిర్మాణాల కూల్చివేత

దుండిగల్: అనుమతులకు మించి నిర్మిస్తున్న పలు అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపల్‌లో బహుళ అంతస్తుల నిర్మాణానికి అనుమతులు తీసుకుని అక్రమంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు అందాయి. వెంటనే విచారణ చేపట్టిన అధికారులు గాగిల్లాపూర్‌లోని డ్రీమ్ వన్ వెంచర్‌లో 4, మల్లంపేటలోని కేవీఆర్ లే అవుట్‌లో 2 నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారి సంజున ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేశారు.

నేడు సీతారామచంద్ర స్వామికి పంచామృతాభిషేకం

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్, మోతీనగర్‌లోని శివరామాంజనేయ స్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా మంగళవారం ఉదయం 6.15 గంటలకు సీతారామచంద్ర స్వాముల వారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన సేవకుడు రమేశ్ అయ్యంగార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాసవీ సొసైటీ ప్రాంగణం నుంచి నగర సంకీర్తన ప్రారంభమై రాధాకృష్ణ హౌసింగ్ సొసైటీ, బోరబండ, గాయత్రీనగర్, శివాజీనగర్, సైట్ 3, బంజారా నగర్, కేఎస్‌నగర్, మోతీనగర్ చౌరస్తా, రాజీవ్‌గాంధీనగర్, జవహర్‌నగర్, శ్రీరామనగర్ మీదుగా కబీర్‌నగర్‌లో శివరామాంజనేయ స్వామి ఆలయం వరకు నగర సంకీర్తన కొనసాగుతుందని పేర్కొన్నారు.

వరదనీటి కాలువ పనుల పరిశీలన



ఆల్విన్‌కాలనీ: శంషీగూడ వార్డు కార్యాలయం వద్ద రూ. 32 లక్షల వ్యయంతో చేపట్టిన వరదనీటి కాలువ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో అనిల్ రెడ్డి, లింగం, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో ఇరాన్ కాన్సులేట్ అధికారులు

బాలానగర్: హైదరాబాద్‌లోని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ కాన్సులేట్ జనరల్ సభ్యులు జేఎన్‌టీయూ హైదరాబాద్ క్యాంపస్‌ను సోమవారం సందర్శించారు. ఇరాన్‌లోని ఇస్ఫహాన్ విశ్వ విద్యాలయానికి విద్యా సహకారం అవకాశాలను అన్వేషించేందుకు కాన్సులేట్ వైస్-కాన్సుల్ మొహ్సెన్ మొఘద్దామి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఫాతిమా నఖ్వీ జేఎన్‌టీయూహెచ్ వీసీ డాక్టర్ టి. కిషన్ కుమార్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఇస్ఫహాన్ పబ్లిక్ విశ్వవిద్యాలయం 1946లో స్థాపించబడిన పురాతన ఇరానియన్ ఉన్నత విద్యా సంస్థల్లో ఒకటి. విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి, ఉమ్మడి పరిశోధన అవకాశాల గురించి చర్చించారు. జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, జేఎన్‌టీయూహెచ్ అకాడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, జేఎన్‌టీయూహెచ్ అకాడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ వి. కామాక్షి ప్రసాద్ పాల్గొన్నారు.


జేఎన్‌టీయూహెచ్ వీసీ కిషన్ కుమార్‌తో సభ్యులు

‘అక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం’


సమావేశంలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ జిల్లా అధికారి వెంకట రెడ్డి తదితరులు

బాలానగర్: చిత్తారమ్మ డబుల్ బెడ్రూం ఇళ్ల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సంఘం చెల్లదని, ఇందులో జరిగిన అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తామని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ జిల్లా అధికారి వెంకట రెడ్డి పేర్కొన్నారు. అధికారుల బృందంతో కలిసి బాలానగర్ డివిజన్‌లోని చిత్తారమ్మ డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయానికి వెళ్లి లబ్ధిదారులతో సోమవారం ఉదయం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పటి ప్రభుత్వం చిత్తారమ్మ బస్తీలో 108 మంది మహిళలకు డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇచ్చిందని కానీ ఇక్కడ ఏర్పడిన సంఘంలో లబ్ధిదారుల భర్తలు సభ్యులుగా ఉండడం సరికాదన్నారు. దీపావళి తర్వాత కొత్తగా కో-ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయాల్లో అనేక సమస్యలు ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవటం లేదన్నారు. 2020 నుంచి ఇప్పటివరకు ఎన్నికలే జరగలేదని చెప్పారు. అక్రమంగా ఏర్పాటు చేసిన సంఘంలో అన్నీ అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు.

బస్తీలో కార్పొరేటర్ పర్యటన

మూసాపేట: జనతానగర్ బస్తీలో స్థానిక కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఏఎంఓహెచ్ అధికారితో ఫోన్లో మాట్లాడి ఫీల్డ్‌లో పనిచేయని ఎస్ఎఫ్ఏపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన నీటి సరఫరా, శుభ్రమైన పరిసరాలు ఉండేలా చూడాలని, కలుషిత నీటి సరఫరా ను వీలైనంత త్వరగా పరిష్కరించకుంటే ప్రజల తరఫున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మూసాపేట డివిజన్ బీజేపీ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి రవిగౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కలుషిత నీటి సరఫరాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేందర్

సన్మానం

ఓల్డ్ బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ఎజాజ్ కుమారుడు సయ్యద్ ఆసిఫ్ హాఫీస్ ముస్లింబస్తీ మదర్సాలో తక్కువ సమయంలోనే ఈ ఖురాన్ పూర్తి చేశాడు. దీంతో మదర్సాలో ముస్లిం మత పెద్దలు, విద్యార్థుల సమక్షంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బీఆర్ఎస్ యువ నాయకుడు మల్లికార్జున యాదవ్‌తో కలిసి సయ్యద్ ఆసిఫ్‌ను అభినందించి శాలువాతో సత్కారించారు. అనంతరం మదర్సా విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు కర్రె జంగయ్య, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు గౌసుద్దీన్, మక్కాల నర్సింగ్ రావు, ఖాదీర్, ఇలియాజ్, ఇమ్రాన్, బర్రి యాదగిరి, విరాజ్, మల్లేశ్ యాదవ్, కుమ్మరి దేవేందర్, రాజుగౌడ్, శ్యాంమోహన్ పాల్గొన్నారు.


సయ్యద్ ఆసిఫ్‌తో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

ఘనంగా ప్రసన్నరావు బర్త్‌డే వేడుకలు

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీ సీనియర్ సిటిజన్ ఫౌండర్ మెంబర్ ప్రసన్నరావు జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కాలనీ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి ఆయన నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వెంకటేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేశ్ యాదవ్, బసప్ప పాల్గొన్నారు.


ప్రసన్నరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న డాక్టర్ పి. నాగిరెడ్డి, సభ్యులు

జేఎన్‌టీయూహెచ్‌లో అవగాహన సదస్సు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, హైదరాబాద్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో ఎంఎస్ఎంఈ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ సహకారంతో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ ప్రోగ్రాంను సోమవారం నిర్వహించారు. సీఐటీడీ హైదరాబాద్‌లోని ఈఎస్‌డీఎంలో డిజైన్ ఇంజినీర్ మాస్టర్ ట్రైనర్ సీహెచ్ కస్తూరి, హైదరాబాద్ ఎంఎస్ఎంటీ సీఐటీడీలో సీనియర్ కన్సల్టెంట్ ఏపీపీసీ శ్రీధర్ సిరిసిపల్లి ప్రసంగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూహెచ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి. నరసింహారెడ్డి హాజరయ్యారు. అసోసియేట్ ప్రొఫెసర్, హెడ్ డాక్టర్ టి. మాధవి కుమారి, ఈఈఈ ప్రొఫెసర్, ఈడీసీ సమన్వయకర్త డాక్టర్ కె. నాగసుజాత కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో 100 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. ఇందులో ఇంజినీరింగ్ 3, టౌన్‌ప్లానింగ్ 6, వెటర్నరీ 1, హెల్త్ 1, యూబీడీ 1 మొత్తం 12 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.


అధికారులకు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

పైపులైన్ లీకేజీని అరికట్టండి

ఆల్విన్‌కాలనీ: కమల ప్రసన్ననగర్‌లో తాగునీటి పైపులైన్ లీకేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. వంశీరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో భాగంగా హెచ్ఎండబ్ల్యూఎస్ కార్యాలయంలో అధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారని వంశీరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యురాలు జయశ్రీ, పార్టీ సీనియర్ నాయకులు నర్సింగ్‌రావు, గోపాల్‌రావు, డివిజన్ ప్రధాన కార్యదర్శులు రేపన్ రాజు, కె. వేణు, డివిజన్ ఉపాధ్యక్షులు వేణుగోపాల్, కరుణాకర్, డివిజన్ సెక్రటరీ జొన్నలగడ్డ శ్రీనివాస్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు మమత, మహిళా మోర్చా కార్యదర్శులు రేణుక, నీరజాచారి, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఎండబ్ల్యూఎస్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న వంశీరెడ్డి, నాయకులు